కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి



దొడగుంటపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, పథకాల అమలులో అపోహలు నమ్మొద్దని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలంటూ గురువారం పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి, బలిజపల్లి, అల్వాల, ముందరితండా, దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం కొరకు పాటుపడుతుందని, అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దమందడి మండలంలోని చీకురుచెట్టుతండా పంచాయతీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు మాజీ సర్పంచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పాన్‌గల్: సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని శాగాపూర్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, నరేందర్‌గౌడు, నిరంజన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: దేశంలో కాంగ్రెస్‌పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కిశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి పెబ్బేరు మున్సిపాలిటిలో 10వవార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా ప్రజలకు అందుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ అన్నారు. స్థానిక నాయకులతో కలిసి శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఇంటింటీ ప్రచారం చేపట్టారు. వనపర్తి పట్టణంలోని 6, 7, 18, తిరుమల కాలనీలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ హస్తంగుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.



వనపర్తి మార్కెట్‌లో ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

వీపనగండ్ల: మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చిన్నంబావి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లురవిని గెలిపించాలని మండలంలోని పెద్దదగడ, మియాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు భోజనాన్ని వడ్డించారు.

ఆత్మకూర్: ప్రతికుటుంబానికి కాంగ్రెస్ పార్టీ భరోసా కల్పిస్తుందని ఆగస్టు 15న రూ.2లక్షలు రైతుల రుణమాఫీ, మహిళలకు ప్రతినెల రూ.2500, రూ.500లకే వంటగ్యాస్ ఇస్తామని రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. గురువారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిక

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కేశం నాగరాజుగౌడ్ సమక్షంలో ముదిరాజ్ సంఘం రాష్ట్రకార్యదర్శి ఏటి కాడి ఆనంద్‌తోపాటు పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

వనపర్తిటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని 31, 32వ, వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

కొత్తకోటలో రోడ్‌షో

కొత్తకోట రూరల్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి సతీమణి చల్లా అశ్లేష అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. దుకాణాల వెంట తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వారాంతపు సంతకు వచ్చిన జనాన్ని కలిశారు.

అమరచింత: అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలోని ఆయా వార్డులలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

రాహుల్ ప్రధానమంత్రి కావడం ఖాయం

వనపర్తి: నెలరోజుల్లో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించడంలో ప్రధాన పాత్ర పోషించిన యాదవులందరినీ గుండెల్లో పెట్టి చూసుకుంటానని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



అమరచింతలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అమరచింత: బీఆర్‌ఎస్ పార్టీ గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలో గురువారం బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకోసం ఇంటింటికీ వెళ్లి ఓటియ్యాలని కోరారు. పట్టణంలోని పది వార్డులలో బూత్ కమిటీ అధ్యక్షుల ద్వారా ప్రచారం చేపట్టారు. కల్లబొల్లి మాటలు చెప్పి ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధినిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో రమేష్, నరసింహులుగౌడ్, బాలరాజ్, రాజు, నాగభూషణంగౌడ్ పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుతారు..

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేట ముంచుతారని ఇప్పటికే ఓసారి రుజువైందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కూతురు ప్రత్యూష అన్నారు. గురువారం ఆమె ఎంపీపీ కృష్ణానాయక్, లక్ష్మారెడ్డి, అశోక్‌లతో కలిసి వెంకటాంపల్లి, ఆగారం, మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, శేఖర్‌రెడ్డి, సురేందర్, అంజిరెడ్డి, నిర్మలమ్మ, అమరేందర్, కాశీనాథ్, మహేష్, చెన్నారెడ్డి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు. మండలంలోని సూగూరు, శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వీపనగండ్ల: బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివయాదవ్, నాయకులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం మండలం వెంకటాంపల్లిలో మాట్లాడుతున్న ప్రత్యూష



సూగూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ ప్రజలను మోసం చేసేందుకే వస్తున్నాయని బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కారు గుర్తుకు ఓటువేసి మన్నెశ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని వార్డుల్లో, గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండ్లరామకృష్ణ, కొత్తబోయశేఖర్, హాశం, రియాజ్‌అలీ, అజ్జర్, తోటరవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయానికి బీఆర్‌ఎస్ ప్రాధాన్యం.

గోపాల్‌పేట: వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చింది బీఆర్‌ఎస్ మాత్రమే అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదుల రిజర్వాయర్ ద్వారా 1.25లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దే అని కొనియాడారు. పరిశ్రమల ద్వారా 16 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెంచామని అన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఓటు వేసి గెలిపిస్తే బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రజలకు ఇంకా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హామీలు నమ్మకండి

ఆత్మకూర్: కాంగ్రెస్ అమలు కాని హామీలను నమ్మకండని ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, దేశాభివృద్ధి సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు గెలిపించాలని నాయకులు అన్నారు. గురువారం పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, తమ్మలివిజయ్, సుప్రియ, ఆనంద్, బాలకృష్ణ, సద్దలవెంకట్, శ్యాం, సూరి, మహేందర్‌రెడ్డి, నరేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజారీతో గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం వనపర్తి మండలంలోని కాశింనగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కమలంపువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పాన్‌గల్: ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని దావాజిపల్లి, రాయినిపల్లి, కేతేపల్లిలో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు.



వనపర్తిలోని కాసీంనగర్‌లో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఖిల్లాఘనపురం: దేశం బాగుకోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి మద్దతు ఇవ్వాలని బీజేపి నాయకులు బుచ్చిబాబుగౌడు, ఆశన్న, విక్రం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో అవినీతి లేని సుపరిపాలన అందించడంతో పాటుగా ప్రపంచంలో దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన నరేంద్రమోదీని మూడో సారి ప్రధాన మంత్రిగా గెలిపించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు.



ఆత్మకూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మోదీ సభను జయప్రదం చేయండి

అమరచింత: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు కోరారు. సభకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



అమరచింత: పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రామ్మోహన్‌శెట్టి, మహిపాల్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంశీచంద్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. శుక్రవారం మక్తల్‌లో జరిగే సీఎం రేవంత్ రెడ్డి జనజాతర సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అయుబ్‌ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండలంలోని మంగళ్లపల్లికి చెందిన చెన్నమ్మ, నర్సింహులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ అంజి బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిన రూ.20 వేలలో చెన్నమ్మ కుటుంబానికి రూ.15 వేలు, నర్సింహ కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. గురువారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ వరద శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణకు మద్యం, లిక్కర్, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కృష్ణారెడ్డి, సాలిబాషా, మోహన్‌రెడ్డి, ఏఎస్‌టీం సిబ్బంది ఉన్నారు.

'మతోన్మాదులకు ఓటుతో గుణపాఠం చెప్పాలి'



మాట్లాడుతున్న బాల్యానాయక్

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్, జిల్లా కార్యవర్గసభ్యుడు బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఎం, కాంగ్రెస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో కార్పొరేట్ శక్తులకు మేలు చేసిందే తప్పా పేదలు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదని విమర్శించారు. మతం పేరుతో ఓట్లు దండుకునేందుకు యత్నిస్తోందని ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే డా. బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామంటోందని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మోసపు మాటలను ప్రజలకు వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి డా. మల్లు రవి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు జంబులయ్య, భీమయ్య, చిన్నయ్య, శేఖర్‌యాదవ్, బాబునాయక్, కాంగ్రెస్ నాయకులు నర్సింహ, విష్ణునారాయణ, వెంకటయ్య, మల్లయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

అమరచింత: బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం పట్టణ శివారులో చోటుచేసుకుంది. మండలంలోని నాగల్‌కద్మూర్‌కు చెందిన కుమ్మరి నారాయణ, రాఘవేందర్‌రెడ్డి బైక్‌పై ఆత్మకూర్‌కు వెళ్లి పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి బయలుదేరారు. పట్టణ శివారులోని ప్రకాశ్ వ్యవసాయ పొలం వద్ద బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. గాయలపాలైన ఇరువురిని ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్సకోసం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కళాశాల గేటుకు తాళం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్, వెంకటేష్ మాట్లాడుతూ.. వర్షం పడినప్పుడు కళాశాల దారి పొడవున వర్షపునీరు నిల్వ ఉండడం, కళాశాల భవనం గోడలు నుంచి పెచ్చులూడి పడుతుండడం, మూత్రశాలలు లేకపోవడం తదితర వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కళాశాల వద్ద మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

పెబ్బేరు రూరల్: మహాత్మజ్యోతిరావు పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అఖిల పక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వనపర్తి మండలంలోని పెద్దగుడెం శివారులో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలపై వారితో అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో పట్టణంలో భవనాలు దొరకకపోవడంతో తాత్కాలికగా పెద్దగుడెం శివారులో కోళ్ల షెడ్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దానికి ప్రభుత్వం దాదాపు రూ.2లక్షల అద్దె చెల్లిస్తూ విద్యార్థులకు సౌకర్యాలు లేని చోట నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. వేసవి కావడంతో ఎండ వేడికి తట్టుకోలేక , అడవి ప్రాంతం కావడంతో విషసర్పాలతో నిత్యం కుస్తి చేస్తూ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రమేష్ జయంతి, శాంతి , గంధం నాగరాజు, శివకుమార్, విష్ణు, కురుమూర్తి, రాములు, చంద్రశేఖర్, చిన్నకురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారి మూలవిగ్రహం

కృష్ణా: మండలంలోని ఐనాపూర్, గుర్జాల్ గ్రామాల్లో శుక్రవారం బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం ఆలయాల్లో రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహా మంగళహారతితోపాటు అగ్నిగుండం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బాడియాల్ పీఠాధిపతి శ్రీ చెన్నవీర శివాచార్య మహాస్వామి, నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధ లింగ మహాస్వాములు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేసినట్లు ఐనాపూర్ గ్రామస్తులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని ఐనాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి ఆహ్వాన పత్రికను అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గంటి శరణబస్వ, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రముఖుల జయంతి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద మహావీర్ రాణా ప్రతాప్, గోపాల కృష్ణగోకలే జయంతి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో వారి చిత్రపటాలు ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. మహావీర్ రాణా ప్రతాప్ మాతృభూమి కోసం చివరి క్షణం వరకు పోరాడిన యుద్ధ వీరుడన్నారు. అక్బర్ కంట కన్నీరు పెట్టించిన ధైర్యశాలి ఆయన అని చెప్పారు. మొగలాయులతో జరిగిన యుద్ధంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు ఎప్పటికి మరవలేమన్నారు. గోపాల కృష్ణ గోకలే గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని కొనియాడారు.

నిలిచిన నీరు



చండూల్ బీడీ ఫ్యాక్టరీ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

అమరచింత: పట్టణంలోని పలు వార్డులలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా వార్డులలో కొత్తగా సీసీ రహదారులను నిర్మించి, ఇరువైపుల మట్టిని వేయకపోవడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లలేక నిలిచిపోతున్నదని కాలనీ ప్రజలు తెలిపారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఆత్మసంతృప్తిని మించిన సంపద లేదు'



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: సంపదలు, సౌకర్యాలు, వసతులు ఎన్ని ఉన్న ఆత్మ సంతృప్తి లేకపోతే ప్రయోజనం ఉండదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆత్మ సంతృప్తికి మించిన సంపద మరొకటి లేదన్నారు. గురువారం హజ్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారెడ్డి స్వయంగా హజ్ యాత్రకు బయలుదేరే ముస్లింల ఇంటింటికి వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్ర పుణ్యఫలం చేకూరుస్తుందని, జీవితంలో ఒక్కసారైన ఈ యాత్ర చేయడం అదృష్టంగా ముస్లింలు భావిస్తారని చెప్పారు. యాత్రలో ప్రవక్త సూచించిన నియమావళికి అనుగుణంగా మసులుకుంటూ ప్రతి రోజు వీలైనంత ఎక్కువ సమయం భగవంతుడి ప్రార్థనలు గడిపేందుకు ఇష్టపడతారని తెలిపారు. లింగ వివక్షత లేకుండా ఆర్థికంగా వనరులు ఉన్న, లేకున్న హజ్ యాత్ర చేసేందుకు అల్లాపై నమ్మకంతో ప్రతి రూపాయిని ఒడిసిపట్టి యాత్ర చేసేందుకు చొరువ చూపుతారని, హజ్ యాత్ర చేయడం ద్వారా మరో జన్మ ఎత్తినట్లుగా ముస్లింలు భావిస్తారని వివరించారు. హజ్ యాత్రికులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో వనపర్తి, రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటుగా దేశం సుభిక్షంగా ఉండేందుకు రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ప్రార్థించాలని కోరారు. అనంతరం మత గురువు ఖలీద్‌ఇమామ్ ఇంటికి వెళ్లి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హజ్ యాత్రికులు, నాయకులు సయ్యద్ అఖ్తర్, అనీస్, రషీద్ ఇమామ్, హకీమ్, కమ్మర్ మియా, బాబా, యాదయ్య, కృష్ణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కురిసిన మోస్తరు వర్షం



చిన్న తాండ్రపాడు చెరువుకు కొద్దిపాటిగా చేరుకున్న వర్షంనీరు

అయిజ: ప్రతి రోజు 40 డిగ్రీలకు పైగా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలను వరుణుడు కరిణించాడు. బుధవారం తెల్లవారుజామున మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ఓ మాదిరి నుంచి భారీ వర్షం కురిసింది. మండలంలో ఒక్కసారిగా భూమి చల్లారింది. చల్లగాలులు వీచడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. శివారుల్లోని చెరువులకు కొద్దిపాటి వర్షం నీరు చేరింది. దుక్కులు దున్నుకోవడానికి వర్షం ఎంతో దోహదపడుతోంది. కత్తెర పంటగా సాగుచేసిన వేరుశనుగ పంటకు వర్షం ఎంతో ఉపయోగంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ధరూరులో భారీ వర్షం..

ధరూరు: మండలంలో గురువారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. నిన్నటి వరకు భగభగమంటున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం తెల్లారు జామున కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ అకాల వర్షం అనుకూలంగా మారింది. తెల్లవారు జామున 3 గంటల నుంచి 5 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది.

శాంతినగర్‌లో మోస్తరు వర్షం..

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. నెలరోజులుగా ప్రజలు ఎండ వేడిమికి అల్లాడిపోయారు. అకస్మాతుగా బుధవారం సాయంత్రం వాతావరణం చల్లబడింది. గురువారం వర్షం కురవడంతో పట్టణ వాసులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించింది. దీంతో ఆయా వార్డుల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్నందున రోడ్లపై, మురుగు కాల్వలు, ప్రైవేట్ ప్లాట్లల్లో నీరు నిల్వ ఉండకుండా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.